కథ

# అమ్ములుకు పెళ్ళయింది

— కోలపల్లి ఈశ్వర్

అమ్ములుకి పెళ్ళవుతుందని నేను కల్లో కూడా అనుకోలేదు.

అమ్ములుకి కన్నొంకరని కాదు. కాలొంకరని కాదు. అందం తక్కువని కాదు.

అమ్ములుకేం తక్కువ?

నిజానికి కో అంటే కోటిమంది నిలబడాలి క్యూలో...

'ఎవరో ఒక్కర్లే' అనుకుంటే కోటిమంది కాకపోయినా, కనీసం కొన్ని వందల మందైనా ముందుకొస్తారు అమ్ముల్ని చేసుకోవటానికి.

కానీ, ఎవరో ఒకర్ని చేస్కోవడానికి అమ్ములు సిద్ధంగా లేకపోవటం వల్లే వచ్చింది చిక్కంతా!

'చేస్కుంటే నేను శివనే చేసుకుంటాను. లేకపోతే జీవితంలో ఇంక పెళ్ళిమాటే ఎత్తకుండా ఇలాగే ఉండిపోతాను' - ఇప్పుడు కాదు, సుమారు రెండేళ్ళ క్రితం అమ్ములు నాతో చెప్పిన మాటలివి.

అలా అంటున్నప్పుడు అమ్ములు కంఠంలో ధ్వనించిన స్థిరత్వం, ముఖంలో ప్రస్ఫుటించిన దృఢ సంకల్పం నాకిప్పటికీ గుర్తే!

నేను అవటానికి అమ్ములుకి బాబాయి నవుతానన్నమాటే గాని, వయసులో మాత్రం చాలా చిన్నవాడ్ని. అమ్ములు కన్నా జస్ట్ ఓ రెండేళ్ళు పెద్దవాడ్ని అంతే! కలిసిన మనసుల్ని విడదీయకండనో, కట్నం డబ్బుల కోసం కక్కుర్తిపడి మేనరికాన్ని మంట గలుపుకోకండనో పెద్దలకు హితవు చెప్పగలిగే వయసు కాదు.

ఇక్కడ 'కలసిన మనసులు' అని ఎందుకన్నానూ అంటే... అమ్ములుకే కాదు శివక్కూడా అమ్ముల్ని చేస్కోవడం ఇష్టమే.

పరాయి సంబంధం కాదాయె! చిన్నప్పట్నుంచీ కలసిమెలసి పెరిగినవారేనాయె! ఆ కలిసిమెలిసి పెరగటంలోనే మనసుల్ని కలుపుకున్నారాయె!

కానీ, డబ్బే సర్వస్వంగా భావించే సోకాల్డ్ పెద్దవాళ్ళకి... పెద్ద మనసులేని పెద్దవాళ్ళకి - పసివాళ్ళ ప్రేమలెలా అర్థమవుతాయ్?

'పరాయి సంబంధం చేస్కుంటే కనీసం రెండు లక్షలైనా ఇస్తారు. మా వాడికి పోనీ మీరు అయినవాళ్ళు కాబట్టి అంత కాకపోయినా అందులో సగమైనా ఇవ్వకపోతే ఎలా? అలా ఇవ్వగలిగితే చూడండి లేదంటే మీ అమ్మాయికి వేరే సంబంధం చూసుకోండి' అంటూ పిల్లలు ఒకరంటే ఒకరు ఇష్టపడుతున్నారని తెలిసినా కూడా మొండి కెత్తేశాడు రాంభద్రయ్య.

రెండు లక్షల్లో సగమంటే లక్ష

లక్ష పైసలకే ఠికాణా లేని అనంతరామయ్య లక్ష రూపాయలెక్కణ్ణించి తేగలడు?


కన్నీరు పెట్టుకున్నాడు. కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడ్డాడు.

అయినా కరగలేదు రాంభద్రయ్య 'లక్ష ఇవ్వగలిగితే సరే, లేదంటే లక్షణంగా దయచేయొచ్చు...' అంటూ గుమ్మంవైపు చెయ్యి చూపించాడే తప్ప, కనీసం ఒక్క మెట్టయినా దిగిరాలేదు.

అమ్ముకోవటానికి ఆస్తులు లేవు. అప్పు పుట్టించడానికి పరపతీ లేదు. ఒకవేళ ఉందనుకున్నా ఆస్తిలేని వాడికి అంత అప్పెవరిస్తారు?

అంచేత చెయ్యగలిగింది లేక పాపం సజల నయనాలతో వెనుదిరిగాడు అనంతరామయ్య.

అమ్ములు నాతో ఇదంతా చెప్పి బాధపడుతుంటే... నాదీ కుర్రవయసే కాబట్టి 'పోనీ లేచిపోరాదూ? ఈ పెద్దవాళ్ళ రోగం కుదుర్తుంది' అన్నాన్నేను ఆవేశంగా.



కానీ అమ్ములందుకు ఇష్టపడలేదు.

'మా కుటుంబంలో మేమిద్దరమే కాదు కదా? మా స్వార్థం ఒక్కటే ఆలోచించి మేమలాంటి కాని పనిచేస్తే దాని దుష్ప్రభావం రేప్పొద్దున మా ఇరు కుటుంబాల్లో ఉన్న ఆడపిల్లల జీవితాలపై పడుతుంది' అంటూ నా ప్రపోజల్‌కి అమ్ములు అభ్యంతరం చెబుతుంటే - 'ఈపాటి జ్ఞానం ఆ పెద్దవాళ్ళకి లేకపోయింది కదా?' అనిపించి బాధపడ్డాను నేను.

'మరైతే ఏం చేస్తావ'ని అడిగితే అమ్ములు నుండి రైఫిల్ గొట్టాలలోంచి బుల్లెట్ దూసుకొచ్చినంత వేగంగా వచ్చింది సమాధానం.

'ఎలాగైనా సరే కష్టపడి ఆ లక్ష రూపాయలు నేను సంపాదించి ఇస్తాను'

నాకు నవ్వొచ్చింది గాని ఆపుకున్నాను, అమ్ముల్ని హర్ట్ చేయటం ఇష్టంలేక.

'ఎలా సంపాదిస్తావు?'

'నాకు చదువుంది... ఎంతోకొంత తెలివితేటలు కూడా ఉన్నాయి. మనసుండాలే గాని మార్గం ఉండకపోతుందా?'

అమ్ములలా అంటుంటే నాకు అమ్ములు మీద జాలేసింది. అమ్ములు తెలివితేటల మీద నా మనసులో అపనమ్మకం లాంటిది కూడా కలిగింది.

లేకపోతే ఏంటి? ఒకటి కాదు రెండు కాదు - లక్ష రూపాయలు! ఎంత కష్టపడితే వస్తుంది అంత డబ్బు! ఎన్నాళ్ళు కూడబెడితే పోగవ్వాలి అంత డబ్బు! అప్పటికి అమ్ములు తల నెరిసిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

కానీ ఎందుకో అమ్ముల్ని డిస్కరేజ్ చేయాలనిపించలేదు నాకు.

'ఆత్మ విశ్వాసం, పట్టుదలా ఉంటే దేన్నయినా సాధించవచ్చు నేను కాదన్ను! కానీ లక్ష రూపాయలంటే మజాకా కాదు. అంత డబ్బు నువ్వు సంపాదించటానికి ఎంతకాలం పడ్తుందో చెప్పలేం. అప్పటిదాకా శివ పెళ్ళి చేస్కోకుండా నీ కోసం వెయిట్ చేయాలిగా?' అంటూ సందేహాన్ని వ్యక్తం చేశాను. అంటే తన మాటల్ని తేలిగ్గా తీసిపారేయకుండానే, అందులోని సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకోమని ఇన్‌డైరెక్ట్‌గా హెచ్చరించానన్నమాట.

ఆ విషయంలో నాకెలాంటి సందేహం లేదు.

అమ్ములు చాలా దృఢంగా చెప్పినప్పటికీ నాకు మరోసారి జాలేసిందే తప్ప అది సంభవమవుతుందని మాత్రం అనిపించలేదు.

అఫ్‌కోర్స్ - అమ్ములుకి చదువుంది కాబట్టి ఏదో ఒక ఉద్యోగం దొరకటం కష్టం కాకపోవచ్చు.

ప్రేమించటం తెలిసిన మగాడికి తండ్రి నెదిరించే ధైర్యం కూడా ఉండాలి! అది లేనప్పుడు అసలు ప్రేమించనేకూడదు.

ఆ మాటే పైక్కూడా అందామనుకున్నాను గాని... ఎందుకులే అని ఊరకుండిపోయాను. నేనేమన్నా ఆర్చేవాడినా తీర్చేవాడినా? అలాంటప్పుడు ఊరికే మాటలు మీరటం దేనికి?

'సరే అమ్ములూ! నీకంత గట్టి నమ్మకమున్నప్పుడు, నీ దారిలో నువ్ సాగిపో! నమ్మకంతో చేసే ఏ పనైనా విజయానికే దారితీస్తుందంటారు. ఐ విష్‌యూ ఆల్‌ది బెస్ట్...' అన్నాను.

ఆ మాటలు ఏదో నా నాలుక చివర్నుంచి వచ్చాయే తప్ప నాకైతే అది సంభవమని అనిపించలేదు.

ఆ తర్వాత నాకు ఉద్యోగం రావటంతో నేను మా ఊర్ని విడిచి ఇదిగో ఈ విశాఖపట్నం వచ్చేశాను.

ఆ మధ్యలో ఒకసారి మా వూరెళ్ళినప్పుడు అమ్ములు హైద్రాబాద్‌లో ఏదో స్టార్ హోటల్‌లో ఉద్యోగం చేస్తున్నట్టుగా తెలిసింది గానీ... అప్పుడు కూడా నాకు అమ్ములుకి శివతో పెళ్ళవుతుందని అనిపించలేదు.

స్టార్ హోటల్లో లక్షాధికార్లు బస చేస్తారే తప్ప, ఆ హోటళ్ళో పనిచేసేవాళ్ళు లక్షాధికారులైపోలేరు కదా?

శివనే పెళ్ళాడాలన్న పట్టుదల నుంచి అమ్ములు గనక బయటపడకపోతే - ఎంత స్టార్ హోటల్‌లో పనిచేసినా లక్ష రూపాయలు కూడబెట్టగలగటం అసాధ్యమే కాబట్టి - అమ్ములుకి పెళ్ళవ్వటం అసంభవం అని కూడా అన్పించింది నాకప్పుడు.

కానీ అసంభవమనుకున్నదే సంభవమయ్యిందని రుజువు చేస్తోంది నా చేతిలో ఉన్న శుభలేఖిప్పుడు.

మరోసారి శుభలేఖలోకి చూశాను.

అమ్ములుకి శివతో పెళ్ళి! ఈ నెల ఆరో తారీఖున.

నాకు చాలా సంతోషంగా అనిపించింది.

నిజంగా అమ్ములు పట్టుదల ఎంత గొప్పది?

★ ★ ★

నన్ను చూస్తూనే పరుగెత్తుకుంటూ ఎదురొచ్చిన అమ్ములు, 'ఏంటి బాబాయ్! నువ్వు కూడా పరాయి వాడిలా ఇప్పుడా రావటం? కనీసం ఓ వారంరోజులైనా ముందుగా రమ్మని ఉత్తరం కూడా రాశాగా?' అని నిష్ఠూరమాడ్తుంటే.

'సెలవు దొరకద్దూ?' అని అతి సాధారణమైన కుంటిసాకె చెప్పి, ఆత్రాన్ని అణచుకోలేక అప్పటికప్పుడే అడిగేశాను. 'కంగ్రాచ్యులేషన్స్! మొత్తానికి అనుకున్నది సాధించావ్! అద్సరేగాని రెండేళ్ళలో లక్ష రూపాయలు ఎలా సంపాదించగలిగావ్?'

అమ్ములు నవ్వి... 'స్టార్ హోటల్‌లో నా జీతమెంతో తెల్సా? నెలకి అయిదువేలు. అదిగాక టిప్పులింకో అయిదారు వేలొస్తాయ్. భోజనం, బస అన్నీ అక్కడే. లక్ష రూపాయలు పోగవ్వక ఛస్తాయా?' అంటుంటే నేను గుడ్లు తేలేశాను.

'అమ్ములా - మజాకా'?' అని అమ్ములు నవ్వుతుంటే, ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ నేను కూడా నవ్వేశాను.

అంతలో... 'ఒరేయ్ అమర్‌నాథ్'! అంటూ ఎవరో పిలవటంతో 'నువ్ లోపలికెళ్ళు బాబాయ్... నాన్న అడిగో ఆ వరండా మీదున్నాడు' అంటూ ఎటో వెళ్ళిపోయాడు నేను ముద్దుగా అమ్ములు అని పిల్చుకునే మా 'అమర్‌నాథ్'గాడు!

'అమర్‌నాథ్ వెడ్స్ శివపార్వతి'

కల్యాణ మంటపం తాలూకు స్వాగత ద్వారంపై మెరుస్తున్న అక్షరాలకేసి ఓ మారు తృప్తిగా చూసి నేను రాంభద్రయ్యగారికేసి నడిచాను.

ఆ రాత్రి...

పదకొండు గంటల నలభై ఏడు నిమిషాలకి...

అమ్ములుకి పెళ్ళయ్యింది... వాడు కోరుకున్నట్టుగానే శివపార్వతితో.

●